యువత మత్తుకు బానిస కావద్దు- ఇన్‌స్పెక్టర్



డ్రగ్స్ నివారణ పై మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి

శంషాబాద్ రూరల్ : మండలంలోని పెద్దషాపూర్‌లో ఉన్న పీఎ న్‌ఆర్ ఫార్మసీ కళాశాలలో గురువారం డ్రగ్స్ నివారణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల మోజులో యువత తమ భవిష్యతును నాశనం చేసుకోవద్దన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాలను విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ అకాడమీలో వనమహోత్సవం



మొక్కలు నాటుతున్న కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: హిమాయత్‌నగర్‌లోని తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోలీసు అధికారులతో కలిసి లతాప్రేమ్‌గౌడ్ మొక్కలు నాటారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మొక్కలు నాటాలని, నేటి తరానికి మొక్కల పెంపకం పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కే.ఆర్.కె.ప్రసాద్‌రావు, అడిషనల్ ఎస్పీ శ్రీనివాస రావు, ఇన్‌స్పెక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గా అడికె రాజు



కో-ఆర్డినేటర్‌గా నియామక పత్రాన్ని అందుకుంటున్న అడికె రాజు

మైలార్‌దేవ్‌పల్లి : రాష్ట్ర ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా అడికె రాజు బీజేపీ కార్యాలయంలో గురువారం ఆనంద్ గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. బీజేపీ సిద్ధాంతాలను, ఆదర్శాలకు అంకితభావంతో పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అడికె రాజు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ పార్టీ తనకు బాధ్యతలు ఇచ్చినందుకు రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, బండి సంజయ్, డాక్టర్ లక్ష్మణ్, ఆనంద్ గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

సత్కారం



కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ రాజేశ్వర్ ముదిరాజ్‌ను సన్మానిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్ : రాష్ట్ర ముదిరాజ్ సహకార సంఘం చైర్ పర్సన్‌గా ఎన్నికైన బుర్ర బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ ముదిరాజ్ నాయకులు, అసెంబ్లీ ఇన్‌ఛార్జి డి.సత్యనారాయణ ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బి.మల్లేష్ ముదిరాజ్, కె.నరసింహా ముదిరాజ్, రమేష్ ముదిరాజ్, కె.యాదయ్య ముదిరాజ్, పృథ్వీ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చరిత్రలో నిలుస్తుంది



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ప్రజాప్రతినిధులు, రైతులు

మణికొండ: ఎన్నికల హామీలలో ఇచ్చినట్టుగా రూ.2 లక్షలలోపు రైతు రుణమాఫీ పథకాన్ని అమలు చేయటం సీఎం రేవంత్‌రెడ్డికే సాధ్యమయ్యిందని, ఇది చరిత్రలో నిలిచిపోతుందని నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మన్ జి.విజయ్‌బాబు, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌కుమార్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణలు అన్నారు. గురువారం ఖానాపూర్‌లోని గండిపేట మండల రైతు వేదిక వద్ద సీఎం చిత్రపటానికి వారు పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బాటలోనే చెప్పిన పని చెప్పినట్టు రుణమాఫీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఎంతో మేలు చేశారన్నారు. మండల వ్యాప్తంగా మొదటి విడతగా లక్ష లోపు రుణాలు ఉన్న 29 మంది రైతులకు రూ. 1కోటి 44లక్షల 7వేల 753లు రుణమాఫీ జరిగిందన్నారు. దీంతో మండలంలోని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ కౌన్సిలర్ జి.అమరేందర్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు గండయ్య, నరసింహా, యాదగిరి, రైతులు పాల్గొన్నారు.

ఛిద్రమైన రోడ్లకు మరమ్మతులు!

- బిల్డర్ ఉపేంద్రనాథ్‌రెడ్డి ఔదార్యం
- సొంత డబ్బులు రూ. 3 లక్షలతో పనులు ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



'సాక్షి'లో బుధవారం వచ్చిన కథనం

సాక్షి ఎఫెక్ట్..



ఈవీవీ కాలనీలో పనులు ప్రారంభించిన బిల్డర్ ఉపేంద్రనాథ్‌రెడ్డి

మణికొండ: ఎవరో వస్తారని..ఏదో చేస్తారని.. ఎదురి చూసి మోసపోకుమా.. అన్న పాటను నిజం చేస్తూ ప్రజల ఇబ్బందిని దూరం చేసేందుకు ఓ బిల్డర్ ముందుకొచ్చారు. మణికొండ మున్సిపాలిటీ పరిధి వర్షాకాలంలో రోడ్లన్నీ గోతులమయంగా మారడం పారిపాటిగా మారింది. ఈ సమస్యపై 'రోడ్లు ఛిద్రం.. జర్నీ జర భద్రం' అనే శీర్షికతో బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందన వచ్చింది. బిల్డర్ ఉపేంద్రనాథ్‌రెడ్డి స్పందించి రూ.3 లక్షల సొంత నిధులతో ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేయిస్తున్నారు.

టెంటర్లు వేసినా..

మున్సిపాలిటీలో కోట్ల రూపాయల నిధులతో పాటు అధికార యంత్రాంగం ఉన్నా వాటిని సకాలంలో పట్టించుకోక పోవటంతో వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పనుల పేర్లతో ఇష్టానుసారంగా రోడ్లను తవ్వి వదిలేస్తుండటంతో గోతులమయంగా మారుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస రాజకీయం, ఎంపీ ఎన్నికల కోడ్‌తో ఏకంగా ఆరు నెలల పాటు మున్సిపాలిటీ సమావేశాలు నిర్వహించి తీర్మానాలు చేయలేకపోయారు. ఎట్టకేలకు ఇటీవల రెండు మున్సిపాలిటీ పాలక కమిటీ సమావేశాలు జరగటంతో అందులో దాదాపు రూ.15 కోట్ల వరకు కొత్త రోడ్లను వేయటం, గోతులను పూడ్చే ప్యాచ్ వర్క్‌లు చేసేందుకు నిధులను కేటాయిస్తూ తీర్మానాలు చేశారు. వాటిని అమలు చేయాల్సిన ఇంజనీరింగ్ ఏఈ ఇటీవలనే అకస్మాత్తుగా బదిలీ అయి వెళ్లిపోయారు. డీఈ అనారోగ్యంతో సెలవులో ఉన్నారు. తీర్మానాలు చేసిన పనులను అంచనా వేయటం, టెండర్‌లు పిలవటం లాంటి కార్యక్రమాలు ఆలస్యమతున్నాయి. అంతలోనే వర్షాలు కురుస్తుండటంతో గుంతల రోడ్లపై ప్రయాణించే ప్రజల బాధలు వర్ణణాతీతం

ప్రజల ఇబ్బందులు చూడలేక..

- మున్సిపాలిటీ పరిధిలోని ఈవీవీ కాలనీ, అలకాపూర్ చింతచెట్టు సర్కిల్, తిరుమలహిల్స్, అలకాపూర్ టౌన్‌షిప్, లక్ష్మిప్రియకాలనీలలో పలుచోట్ల రోడ్లపై గుంతలు పడటం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తేవి. తమ 7, 8వ వార్డులలో ఈ సమస్య అధికంగా ఉండటం, అదే విషయం 'సాక్షి'లో ప్రచురించడం ఆయా వార్డుల కౌన్సిలర్లు పద్మారావు, నవీన్ కుమార్ బిల్డర్, ది సిటిజన్ కౌన్సిల్ కార్యదర్శి ఉపేంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన రూ.3 లక్షల సొంత డబ్బులతో ఈవీవీ కాలనీ ప్రవేశం, చింతచెట్టు సర్కిల్, తిరుమలహిల్స్ రోడ్డులో మరమ్మతులు చేసే పనులను గురువారం ప్రారంభించారు.
- ఈ విషయం తెలుసుకుని మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, ఏఈ సంజయ్‌కుమార్ అక్కడకు వచ్చి మున్సిపాలిటీ తరఫున తాము వెంటనే పనులు చేయిస్తామనే హామీ ఇచ్చి వారిని ఉపసంహరింప చేయకుండా ఇంజనీరింగ్ నిబంధనల ప్రకారం పనులు చేయాలని ఉచిత సలహా ఇచ్చి వెళ్లారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్డర్ ఉపేంద్రనాథ్‌రెడ్డి చేస్తున్న పనుల పట్ల స్థానికంగా ఆయా కాలనీల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పహాణీల ట్యాంపరింగ్!

శంషాబాద్ హెచ్ఎండీఏ భూముల్లో భారీ అవకతవకలు

- కబ్జాదారులకు రెవెన్యూ అధికారుల అండ..విచారణలో వెల్లడి
- అప్పటి రికార్డ్ అసిస్టెంట్, ప్రస్తుత అబ్దుల్లాపూర్‌మెట్ డీటీపై వేటు
- జూనియర్ అసిస్టెంట్ అజయ్, వీఆర్ఏ రవిపై కూడా..
- ప్రస్తుత తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్లకు నోటీసులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: కబ్జాదారులతో కుమ్మక్కై సర్కారు భూ రికార్డుల ట్యాంపరింగ్‌కు సహకరించిన ముగ్గురు రెవెన్యూ ఉద్యోగులపై కలెక్టర్ వేటు వేశారు. అక్రమార్కులను కాపాడేందుకు రికార్డులను పరిశీలించకుండానే నివేదిక సమర్పించిన ముగ్గురు తహసీల్దార్లకు తాఖీదులు జారీ చేశారు. ఇది లావుండగా, ఈ అవినీతిపర్వంలో తమ ప్రమేయం లేదని ఇప్పటికే వీరిలో కొందరు కోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది.

ట్యాంపరింగ్ చేసి.. ఏమార్చి

ఉమ్మడి ఏపీ హయాంలోనే ట్రక్ టెర్మినల్ నిర్మాణం కోసం హెచ్ఎండీఏకి శంషాబాద్‌లోని 724, 725 సర్వే నంబర్లలో 214.02 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఆ మేరకు అప్పట్లోనే అవార్డు (నం. 1/1990, ఫైల్ నంబర్ ఐఏ84/86)ను కూడా జారీ చేసింది. సర్వే నం. 725/21లో 7.7 ఎకరాలు, సర్వే నంబర్ 725/23లోని 10.7 ఎకరాలు, సర్వే నం.725/ 24లోని 12.34 ఎకరాలతో పాటు మరికొన్ని సర్వే నంబర్లలో సుమారు 50 ఎకరాల భూమిని తమ పూర్వీకులు 'పైగా అథారిటీ' నుంచి వేలంలో కొనుగోలు చేశారని పేర్కొంటూ ఫలక్‌నుమాకు చెందిన యహియా ఖురేషీ, వట్టెపల్లికి చెందిన మహ్మద్ మొయినొద్దీన్ అప్పట్లో కోర్టును ఆశ్రయించారు. ఇందుకు సాక్ష్యంగా తప్పుడు రికార్డులె సమర్పించారు. పిటిషనర్లు కోర్టుకు సమర్పించిన పహాణీలు, ఇంటి నంబర్లు, పన్ను చెల్లింపు రశీదులు సహా ఇతర రికార్డులన్నీ నకిలీగా తేలింది. విలువైన ఈ భూములు హెచ్ఎండీఏకే చెందుతాయని ఇటీవల కోర్టు తీర్పు కూడా ఇచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు హెచ్ఎండీఏ అధికారులు ఆయా భూములను పోలీసుల సహకారంతో స్వాధీనం చేసుకున్నారు. అయితే రికార్డుల సెక్షన్‌లోని పహాణీలను ట్యాంప రింగ్ చేసి, అసలు పహాణీలకు నకలు సృష్టించి, కబ్జాదారులకు సహకరిండంపై ప్రభుత్వం అంతర్గత విచారణ చేపట్టింది. డబ్బులు తీసుకుని సహకరించిన వారి పేర్లను కబ్జాదారులు వెల్లడించినట్లు తెలిసింది.

ముగ్గురిపై వేటు.. మరో ముగ్గురికి నోటీసులు

వివాదాస్పద ఈ భూముల పహాణీలను మార్చి..హెచ్ఎండీఏను, ప్రభుత్వాన్ని ఏమార్చేందుకు అప్పటి సీనియర్ అసిస్టెంట్ (ప్రస్తుతం అబ్దుల్లాపూర్ మెట్‌లో డిప్యూటీ తహసీల్దార్) రామకృష్ణ సహ అప్పటి వీఆర్ఏ (ప్రస్తుతం బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో జూనియర్ అసిస్టెంట్) రవి, జూనియర్ అసిస్టెంట్ అజయ్, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్ యత్నించినట్లు విచారణలో తేలింది. వీరిలో రామకృష్ణ, రవి, అజయ్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ శశాంక ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. అంతేకాదు రికార్డులు సరిగా పరిశీలించకుండా, గత అధికారులు చేసిన తప్పిదాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తూ తప్పుడు రిపోర్టులు పంపిన ప్రస్తుత శంషాబాద్ తహసీల్దార్ నాగమణి, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్‌కు సంజాయిషీ నోటీసులు జారీ చేయడం రెవెన్యూ వర్గాల్లో కలకలం సృష్టిస్తోంది. హెచ్ఎండీఏ భూముల్లో వెలిసిన ఇళ్లకు ఇంటి నంబర్లు జారీ చేసిన మున్సిపల్ అధికారుల్లోనూ అలజడి మొదలైంది. పీటీఐఎన్ నంబర్ల ఆధారంగా అక్రమార్కులు ఫిబ్రవరిలోనే పదికిపైగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఇందుకు సహకరించిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిలోనూ ఆందోళన మొదలైంది.

50 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ప్రకటించాలి



మాట్లాడుతున్న గోవర్ధన్ యాదవ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మండలంలో గురువారం పీఆర్‌టీయూటీఎస్ రంగారెడ్డి జిల్లా శాఖలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కన్నయ్యగారి గోవర్ధన్ యాదవ్ హాజరయ్యారు. జీవో నంబర్ 11,12 సవరించి బీఈడీ అర్హత కలిగిన ఉపాధ్యాయులకు పీఎస్‌హెచ్ఎం పోస్టులు కల్పించాలని, 10 వేల పీఎస్‌హెచ్ఎం పోస్టులను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని గోవర్ధన్ యాదవ్ అన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం వెంటనే 50 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్స్ వెంటనే క్లియర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ రంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షులు జడ్పీహెచ్ఎస్ బుద్వేల్, అత్తాపూర్, శివరాంపల్లి, మైలార్‌దేవ్‌పల్లి, గణేష్‌నగర్, పద్మశాలిపురం, పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలశాఖ ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ చారి, మాజీ అధ్యక్షులు సుదర్శన్, అసోసియేట్ అధ్యక్షులు సురేశ్, కేశంపేట్ మండల అధ్యక్షులు శ్రీనివా సాగర్, చేవెళ్ల మండల అధ్యక్షులు సత్తయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదికలో రుణ మాఫీ సంబరాలు



శంషాబాద్ రూరల్ : మండలంలోని మల్కారంలో రైతు వేదికపై గురువారం నిర్వహించిన రుణ మాఫీ సంబరాలకు కలెక్టర్ శశాంక హాజరయ్యారు. మండలంలో మొత్తం 1028 మంది రైతులకు రూ.4,89,37,225 రుణమాఫీ అయ్యిందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి, ఏఓ కవిత, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరుల ప్రత్యేక ప్రార్థనలు

అత్తాపూర్ : మొహర్రం అనంతరం వచ్చే చివరి రోజున షియా ముస్లింలు వారి సాంప్రదాయాలకు అనుగుణంగా మత పెద్దలకు ఆత్మ శాంతి చేకూరాలని కోరుతూ పెద్ద సంఖ్యలో ఊరేగింపుగా అత్తాపూర్ ఎంఎం పహాడి సమీపంలో ఉన్న దర్గా, ఈద్గాలలో ప్రార్థనలు చేస్తారు. మౌలాలి సాలార్జంగ్ మ్యూజియం పరిసర ప్రాంతాల్లో ఉన్న ముస్లింలు నల్లటి దుస్తులు ధరించి తారతమ్యం లేకుండా అందరూ పాల్గొంటారు. సాంప్రదాయాలకు అనుగుణంగా రొట్టెలు, షర్బత్ పంపిణీ చేశారు. మొహర్రం సందర్భంలో షియా ముస్లిం వారి కుటుంబాల్లో ఎలాంటి శుభ కార్యాలు జరుపుకోకుండా ఉంటారు. ఈ సందర్భంగా బుధవారం రాత్రి నుండి గురువారం తెల్లవారు జాము వరకు జరిగిన ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఏసిపి చింతమనేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంఎం పహాడి ఖయ్యూం నగర్ పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ జి. వెంకటరాంరెడ్డి, శ్రీనివాస్, నిమ్మల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



బందోబస్తులో పాల్గొన్న పోలీసులు

ఇంటింటికి మొక్కల పంపిణీ



బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్‌లో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ మాలతీనాగరాజు ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తమ ఇంటితోపాటు పరిసరాలు, ఖాళీ ప్రదేశాలను గుర్తించి మొక్కలను పెంచాలన్నారు. పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కల పెంపకం ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి పాటుపడతా



ముదిరాజ్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను సన్మానిస్తున్న నాయకులు

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కో-ఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్‌గా బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టి ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా బండ్లగూడలోని ఆయన నివాసంలో పలువురు నేతలు కలిసి ఘనంగా సన్మానించారు. మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ అభ్యర్థి నీలం మధుముదిరాజ్, షాద్‌నగర్ బీజేపీ పార్టీ కంటెస్టెడ్ అభ్యర్థి అందే బాబయ్య, రంగారెడ్డి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మల్లేష్‌ముదిరాజ్ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బొర్రా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ ముదిరాజ్‌లను ఐక్యం చేసి వారు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగేలా చూస్తానన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందుల లేకుండా వారి అభివృద్ధికి తోడ్పడుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



ప్రజాపాలన కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీ రవి కుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాన్ని గురువారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ పరిశీలించారు. ప్రజాపాలన కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి, మహాలక్ష్మీ పథకాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరిస్తున్నారన్నారు. 200 యూనిట్ల లోపు గృహానికి ప్రభుత్వం ఉచిత కరెంటు అందిస్తుందన్నారు. ఇందు కోసం ప్రతీ ఒక్కరూ ప్రజాపాలన కేంద్రంలో దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని... కేంద్రానికి నేరుగా వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తుఫాన్, తవేరా వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక

మైలార్‌దేవ్‌పల్లి : ఆరాంఘర్‌లోని తుఫాన్ తవేరా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. గురువారం ఆరాంఘర్ చౌరస్తాలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని 150 మంది కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గడ్డి సాడయ్య ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు కే. శ్రీను, కోషాధికారి చంద్రారెడ్డి, రాజు నాయక్, జాయింట్ సెక్రటరీ సీఎస్ రెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డ్రై వర్స్, ఓనర్స్ సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకొని అందరూ కలిసి మెలిసి ఉండేలా చూస్తానని అధ్యక్షుడు సాడయ్య ముదిరాజ్ అన్నారు.



విజయ్ ఆయిల్‌ను నాణ్యతకు బ్రాండ్‌గా నిలబెట్టాలి

ఏజీవర్సిటీ: రంగారెడ్డి జిల్లా అరంఘడ్‌లోని విజయ్ ఆయిల్ ప్యాకింగ్ స్టేషన్‌ను తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయిల్ ప్యాకింగ్ స్టేషన్ పనులను వేగవంతం చేయాలని, ఆయిల్ ప్యాకింగ్ సెక్షన్‌లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. విజయ్ ఆయిల్‌లోని సన్‌ఫ్లవర్, పామ్ ఆయిల్‌ను బ్రాండెడ్‌గా వుండేలా చేయాలని అన్నారు. ధర తక్కువని కల్తీ నూనెలు కొని ఆరోగ్యాలను పాడుచేసుకోవద్దని ప్రజలకు సూచించారు. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే ఆయిల్ పై కేంద్రం సెస్ విధిస్తే మన రైతుల ఆయిల్ ఫామ్‌కు ధర పెరిగి లాభాలు చేకూరుతుందన్నారు.



విజయ్ ఆయిల్ స్టేషన్‌లో అధికారులతో మాట్లాడుతున్న చైర్మన్


డంప్‌యార్డును అభివృద్ధి చేస్తాం

మణికొండ: మున్సిపాలిటీ వ్యాప్తంగా వస్తున్న చెత్తను డంప్ చేస్తున్న యార్డ్‌ను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, కమీషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం వారు కౌన్సిలర్‌లతో కలిసి వట్టినాగులపల్లి శివారులో ఉన్న చెత్త డంపింగ్ యార్డు బ్యూటిఫికేషన్‌ను రూ. 70 లక్షల నిధులతో పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డంపింగ్ యార్డు నుంచి దుర్గంధం వస్తుందని, ఉన్న చెత్తతో కంపోస్టు ఎరువులను తయారు చేయటంతో పాటు చుట్టు ప్రక్కల నందన వనంలా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు బి.యాదమ్మ, జి.శివారెడ్డి, జి.అమరేందర్‌రెడ్డి, డీఈ నరసింహారాజు, సానిటేషన్ ఇంఛార్జ్ లచ్చిరాంలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



చెత్త డంపింగ్ యార్డు పనులను ప్రారంభించిన ప్రజాప్రతినిధులు

విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ పి. నరేందర్




హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు

మైలార్‌దేవ్‌పల్లి : డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ పి. నరేందర్ విద్యార్థులకు సూచించారు. గురువారం మహావీర్ ఇంజినీరింగ్ కళాశాలలో సుమారు 450 మంది విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు నేటి విద్యార్థులపై ఆధారపడి ఉందని, డ్రగ్స్ మత్తుకు బానిసై జీవితాలను నాశనం చేసుకోకూడదని అన్నారు. డ్రగ్స్ సరఫరా చేసేవారి వివరాలను పోలీసులకు తెలియజేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తుందని, విద్యార్థులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరి సంరెడ్డి సురేందర్ రెడ్డి, జాయింట్ సెక్రటరి ధనుంజయ్‌రెడ్డి, ఎస్ఐ కృష్ణ, ఏఎస్ఐ షాహిద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలి

మణికొండ: కోకాపేట 5వ వార్డులో గురువారం వైస్ చైర్మన్ జి.విజయ్‌బాబు, కౌన్సిలర్ జి.శివారెడ్డిలతో పాటు ఇంటింటికి గులాబీ, మామిడి, దానిమ్మ, ఉసిరి, నిమ్మ లాంటి మొక్కలను పంపిణీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వీలైనన్ని ఎక్కువగా మొక్కలు, వృక్షాలను పెంచుకోవాలని నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ అన్నారు. నర్సరీలలో అన్నీ రకాల మొక్కలను పెంచుతున్నామని, ప్రజలకు వాటిని ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్ వాసులకు మొక్కలు అవసరం అయితే తమను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారి సంప్రీత్, సానిటేషన్ సూపర్‌వైజర్ మహిపాల్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



మొక్కలను పంపిణీ చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్‌లు